# పోలీసే ప్రజల రక్షకుడు






**నేరాలపై కఠిన నిఘా చర్యలు**
**భద్రతకు సమగ్ర కార్యాచరణ**
**బెట్టింగ్‌పై కఠిన చర్యలు..**

బాపట్ల జిల్లా ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. నేరాల నియంత్రణ, బెట్టింగ్ అరికట్టడం, రోడ్డు భద్రత, యాత్రికుల రక్షణపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బాపట్ల రక్షణ న్యూస్

2లో

మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
ఆదివారం 19 ఏప్రిల్ 2026 పేజీలు : 4





# ఆకాశంలో చీరాల అందాలు



- పర్యటకానికి కొత్త దశ...
- రామాపురం బీచ్‌లో పరామోటర్ ట్రయల్ లాంచ్‌లు విజయవంతం
- అడ్వెంచర్ టూరిజానికి కొత్త దిశలో విహంగ్ అడ్వెంచర్స్
- "నెక్స్ట్ గోవా" లక్ష్యానికి మరింత బలం



- డీజీసీఏ శిక్షణ పొందిన పైలట్లు, అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలు
- ట్రయల్ లాంచ్‌లతో సాంకేతిక, భద్రతా అంశాల సమగ్ర పరిశీలన
- చిరాలను అడ్వెంచర్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం
- స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, వ్యాపారాలకు ఊతం
- త్వరలో అధికారిక ప్రారంభం... పర్యాటకులకు ప్రత్యేక అనుభవం
- "రండి... పక్షిలా ఎగిరే అనుభవాన్ని పొందండి!"

చీరాల రామాపురం బీచ్‌పై ఆకాశంలో కొత్త రంగులు మెరిశాయి. విహంగ్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరామోటర్ ఎయిర్ సఫారి ట్రయల్ లాంచ్‌లు విజయవ ంతంగా సాగడంతో తీర ప్రాంత పర్యాటకానికి కొత్త ఊపు వచ్చింది. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో జరిగిన ఈ ప్రదర్శన పర్యా టక రంగంలో కీలక మలుపుగా నిలిచింది. పక్షిలా ఎగురుతూ సముద్ర తీరాన్ని వీక్షించే అరుదైన అనుభవాన్ని అందించే ఈ కార్యక్రమం చీరాల ను అడ్వెంచర్ హబ్‌గా మార్చే దిశగా ముందడుగు వేస్తోంది. ప్రభుత్వ "నెక్స్ట్ గోవా" లక్ష్యానికి ఈ ప్రాజెక్ట్ మరింత బలం చేకూర్చనుంది.

చీరాల, రక్షణ న్యూస్

వివరాలు 2లో..

రామాపురం బీచ్‌లో విహంగ్ అడ్వెంచర్స్ నిర్వహించిన పరామో టర్ ఎయిర్ సఫారి ట్రయల్ లాంచ్‌లు విజయవంతమ య్యాయి. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సమక్షంలో జరిగిన ఈ ప్రదర్శన తీర ప్రాంత పర్యాటకానికి కొత్త ఊపు తీసుకు వచ్చింది. పక్షిలా ఎగురుతూ సముద్రాన్ని ఆస్వాదించే అరు దైన అనుభవం త్వరలో ప్రజలకు అందు బాటులోకి రానుంది. "నెక్స్ట్ గోవా" లక్ష్యానికి ఇది కీలక ముందడుగుగా భావి స్తున్నారు.

# సత్తెనపల్లి కారాగారాన్ని జడ్జి తనిఖీ

- ఆహారం, సదుపాయాలపై సమగ్ర పరిశీలన
- సత్ ప్రవర్తనతో భవిష్యత్ నిర్మించుకోవాలని సూచన



వివరాలు 2లో..

రిమాండ్ ముద్దాయిలకు న్యాయ వ్యవస్థ అనేక హక్కులు కల్పించిందని, వారు భవిష్యత్తులో సత్ ప్రవర్తనతో జీవితం గడపా లని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయ్ కుమార్ రెడ్డి సూ చించారు. సత్తెనపల్లి ఉప కారాగారాన్ని ఆయన శనివారం తని ఖీ చేసి ఖైదీల పరిస్థితులను పరిశీలించారు.

సత్తెనపల్లి, రక్షణ న్యూస్

# హెల్మెట్ తప్పనిసరి..

**బాపట్లలో కఠిన తనిఖీలు**
**రోడ్డు భద్రతపై రవాణా శాఖ దృష్టి**
**హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు తప్పవు**
**వాహన పత్రాల పరిశీలనలోనూ కఠినతరం**



వివరాలు 2లో..

బాపట్ల జిల్లాలో రోడ్డు భద్రత నిబంధనల అమలుపై రవాణా శాఖ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెచ్చరిస్తూ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బాపట్ల, రక్షణ న్యూస్

# జలధార--జలహారతి, బడి పిలుస్తోంది కి శ్రీకారం.

**విద్యార్థుల నమోదు పెంపుపై కలెక్టర్ దృష్టి**



గుంటూరు జిల్లాలో జల వనరుల పరిరక్షణ, విద్యాభివృద్ధి లక్ష్యంగా "జలధార--జలహారతి" మరియు "బడి పిలుస్తోంది" కార్యక్రమాలను సమన్వయంతో పెద్ద ఎత్తున అమలు చేయా లని జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ ఆదేశించారు.

2లో.

గుంటూరు,రక్షణ న్యూస్

19- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/18/2026 11:44 PM Page 2



# పోలీసే ప్రజల రక్షకుడు

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా పోలీస్ శాఖలో నేరాల నియంత్రణపై జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారు సమగ్ర సమీక్ష నిర్వహించారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పోలీస్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.క్రికెట్ బెట్టింగ్, మాదకద్రవ్యాల వ్యాపారం, సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని అవసరమైతే రిమాండ్‌కు తరలించాలని ఆదేశించారు.తీవ్రమైన కేసులు, పోక్సో కేసుల దర్యాప్తును సాంకేతిక పరిజ్ఞానంతో వేగవంతం చేసి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని చెప్పారు. మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా నిర్వహించాలని ఆదేశించారు.పర్యాటక ప్రాంతాలు, దేవాలయాల్లో సీసీ కెమెరాల నిఘా పెంచి యాత్రికుల భద్రతను బలోపేతం చేయాలని సూచించారు. రాత్రి పహారా బలోపేతం చేసి దొంగతనాలను అరికట్టాలని తెలిపారు.సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# జలధార--జలహారతి, బడి పిలుస్తోంది కి శ్రీకారం

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు,రక్షణ న్యూస్**

జిల్లాలో నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ "జలధార--జలహారతి" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఫిరంగిపురం మండలం హౌస్ గణేష్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ పాల్గొని చెరువు పనులను ప్రారంభించారు. 109 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు 192 ఎకరాల ఆయకట్టుకు ఉపయోగపడనుంది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లాలోని వెయ్యికి పైగా చెరువులను నిండు కుండలా మార్చేందుకు ప్రజల సహకారం అవసరమని చెప్పారు. చెరువులలో పూడిక తొలగింపు, కాలువల శుభ్రత ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా "స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని "వాటర్ పాజిటివ్ ఆంధ్ర" థీమ్‌తో నిర్వహిస్తూ, నీటి ప్రవాహ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాల పెంపుతో విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుందని తెలిపారు.

ఇక విద్యా రంగంలో భాగంగా "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి చిన్నారి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని, అవగాహన ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్ వంటి ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు.

విద్యార్థుల నమోదు శాతం పెంపు, డ్రాప్‌అవుట్‌ల తగ్గింపు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని, 20, 21 తేదీల్లో సర్వే, 22న అవగాహన, 23న నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే జిల్లాను ఆదర్శంగా నిలపవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆకాశంలో చీరాల అందాలు

మొదటి పేజీ తరువాయి

**చీరాల, రక్షణ న్యూస్**

రామాపురం బీచ్‌లో విహంగ్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరామోటర్ ఎయిర్ సఫారి ట్రయల్ లాంచ్‌లు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యక్షంగా వీక్షించారు. ట్రయల్ లాంచ్‌ల ద్వారా రాబోయే ఎయిర్ సఫారి కార్యకలాపాలకు సంబంధించిన సాంకేతిక, భద్రతా అంశాలను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు భద్రతా ప్రమాణాలు, ఆపరేషనల్ విధానాలు సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. డీజీసీఏ శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన పైలట్లు, అంతర్జాతీయ ప్రమాణాల భద్రతా ఏర్పాట్లు ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతగా నిలుస్తున్నాయి.పరామోటర్ ఎయిర్ సఫారి ద్వారా పర్యాటకులు సముద్ర తీరాన్ని పక్షిలా ఎగురుతూ ఆస్వాదించే వినూత్న అనుభవం పొందనున్నారు. ఇది చీరాల ప్రాంతాన్ని ప్రత్యేక పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టే అవకాశాన్ని కల్పిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ సహా సమీప నగరాల ప్రజలకు చీరాల ఒక ప్రముఖ వీకెండ్ డెస్టినేషన్‌గా మారుతున్న నేపథ్యంలో ఈ కొత్త ఆకర్షణ మరింత సందర్శకులను ఆకట్టుకోనుంది .ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ తీర ప్రాంతాన్ని "నెక్స్ట్ గోవా"గా అభివృద్ధి చేసే లక్ష్యంతో చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో విహంగ్ అడ్వెంచర్స్ ప్రారంభించిన పరామోటర్ ప్రాజెక్ట్ రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త దిశను చూపుతోంది.ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభించనుంది. పర్యాటకుల రాకపోకలు పెరగడం వల్ల స్థానిక వ్యాపారాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.విహంగ్ అడ్వెంచర్స్ సంస్థ సురక్షితమైన, నాణ్యమైన అడ్వెంచర్ అనుభవాలను అందించేందుకు కట్టుబడి ఉందని నిర్వాహకులు తెలిపారు. త్వరలో అధికారిక ప్రారంభోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు, పర్యాటకులు ఈ వినూత్న అనుభవాన్ని ఆస్వాదించాలని ఆహ్వానించారు."రండి... పక్షిలా ఎగిరే అనుభవాన్ని పొందండి!" అంటూ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# సత్తెనపల్లి కారాగారాన్ని జడ్జి తనిఖీ

మొదటి పేజీ తరువాయి

**సత్తెనపల్లి, రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని ఉప కారాగారాన్ని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) మరియు సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ వి. విజయ్ కుమార్ రెడ్డి శనివారం సాయంత్రం తనిఖీ చేశారు.మొదటగా కారాగార పరిసరాలను పరిశీలించిన ఆయన, అక్కడ ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం నాణ్యతను సమీక్షించారు. అదేవిధంగా ఖైదీలకు అందిస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యతను కూడా తనిఖీ చేసి, సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కారాగారంలో నిర్వహిస్తున్న రిజిస్టర్‌ను పరిశీలించిన జడ్జి, ముద్దాయిల వివరాలను తెలుసుకున్నారు. వారికి అందుతున్న సదుపాయాలపై ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని, అవసరమైన మార్పులు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రిమాండ్ ముద్దాయిలకు న్యాయ వ్యవస్థ అనేక హక్కులను కల్పించిందని తెలిపారు. ఆ హక్కులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో సత్ ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జీవితాన్ని సక్రమంగా మార్చుకునే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ తనిఖీ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఫౌషిద్ హుస్సేన్, ఫ్రీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బి.ఎల్. కోటేశ్వరరావు, ఉప కారాగార సూపరిడెంట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. అధికారులు ఖైదీల సంక్షేమం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# హెల్మెట్ తప్పనిసరి..

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల, రక్షణ న్యూస్**

జిల్లాలో రోడ్డు భద్రతను పెంపొందించేందుకు రవాణా శాఖ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా రవాణా శాఖ అధికారి టి.కె. పరంధామయ్య రెడ్డి ఆదేశాల మేరకు శనివారం బాపట్ల పట్టణంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని చిల్ రోడ్డు సెంటర్ వద్ద నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంగారావు నేతృత్వంలో సిబ్బంది పాల్గొన్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ద్విచక్ర వాహనదారులపై ప్రత్యేక దృష్టి సారించి హెల్మెట్ ధరించడాన్ని కచ్చితంగా పరిశీలించారు.హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

అదేవిధంగా వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులను కూడా పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంవీఐ బి. కిషోర్ బాబు సహా ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు చేపట్టిన ఈ చర్యలు వాహనదారుల్లో జాగ్రత్తను పెంచుతున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

19- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/18/2026 11:44 PM Page 3



# గ్రామ సేవలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

**వినుకొండ రక్షణ న్యూస్**



పల్నాడు జిల్లా వినుకొండలో గ్రామ సంఘాల సహాయకులు (వీఓఏలు)కు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. శనివారం ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీఓఏలకు స్వయంగా స్మార్ట్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సాధికారతకు వీఓఏలు కీలకంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వారధులుగా నిలుస్తున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాలతో కలిసి వీఓఏలు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. డిజిటల్ సేవలను మరింత వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ స్మార్ట్ ఫోన్లను అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ఫోన్ల ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, డేటా సేకరణ, నివేదికల సమర్పణ వంటి పనులను సులభంగా నిర్వహించవచ్చని చెప్పారు. అందుకున్న స్మార్ట్ ఫోన్లను సమర్థంగా వినియోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వీఓఏలకు సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వీఓఏలు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ భద్రతకు సాయం

**గుంటూరు రక్షణ న్యూస్**




గుంటూరు జిల్లా ట్రాఫిక్ పోలీస్‌లకు ట్రాఫిక్ నియంత్రణలో ఉపయోగపడే కదిలే స్టాపర్లను వేగా జ్యూయలర్స్ సంస్థ అందజేసింది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 200 మూవబుల్ స్టాపర్లను జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందల్ ఐపీఎస్ గారికి సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో ఆధునిక పరికరాల అవసరం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ట్రాఫిక్ డైవర్షన్స్, ప్రత్యేక బందోబస్తు విధులు, వీఐపీ రాకపోకల సమయంలో ఈ కదిలే స్టాపర్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సమాజ పట్ల బాధ్యతగా పోలీస్ శాఖకు సహకరిస్తూ ఈ స్టాపర్లను అందజేసిన వేగా జ్యూయలర్స్ సంస్థను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, ట్రాఫిక్ సిబ్బంది, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నగరంలో జల సంరక్షణ పిలుపు




**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కొరిటెపాడు చెరువు వద్ద జలధార--జల హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ పాల్గొని అవగాహన ర్యాలీతో పాటు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీరే ప్రాణాధారమని, ప్రతి బొట్టు నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారా భావి తరాలకు జీవనాధారాన్ని కాపాడగలమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను నగరంలో పటిష్టంగా అమలు చేస్తున్నామని చెప్పారు. నీటి వనరుల పరిరక్షణలో భాగంగా చెరువులు, కాలువలను శుభ్రం చేయడంతో పాటు ఆక్రమణలను తొలగించి వాటిని సంరక్షిస్తామని తెలిపారు. అమృత్ పథకం మరియు జీఎంసీ నిధులతో చెరువుల ఇన్లెట్స్, ఛానల్స్ శుభ్రపరిచే పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటిలో నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి వార్డులో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి పిలుపు మేరకు ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛత కార్యక్రమాలు నగరాన్ని మరింత పరిశుభ్రంగా, జలకళతో ఉంచేందుకు దోహదపడతాయని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒంగోలు జాతి ఉత్సవం



**ప్రత్తిపాడు రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్, నందమూరి తారక రామారావు మెమోరియల్ ఆధ్వర్యంలో ఒంగోలు జాతి పశువుల ప్రదర్శన ఘనంగా కొనసాగుతోంది. మూడవ రోజు నిర్వహించిన పోటీల్లో నాలుగు పళ్ల విభాగంలో 18 జతలు, ఆరు పళ్ల విభాగంలో 10 జతలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. నూతలపాటి పరమేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు నూతలపాటి త్రిలోక్‌నాథ్, అమర్‌నాథ్‌లు మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతులు భారీగా తరలివచ్చి ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడంతో పాటు ప్రదర్శనను ఆసక్తిగా వీక్షిస్తున్నారు. కార్యక్రమం ప్రత్తిపాడులో వైభవంగా కొనసాగుతోంది.

# స్వచ్ఛతకు శ్రీకారం




**చిలకలూరిపేట రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛంద్ర--స్వచ్ఛ చిలకలూరిపేట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. స్వచ్ఛ చిలకలూరిపేట కార్యక్రమంలో భాగంగా జల ధార, జల హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ మండే వేసవికాలంలో నీటిని జాగ్రత్తగావిని యోగించుకోవాలని ప్రజలకు సూచించారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇంకుడు గుంతలు త్రవ్వి వర్షపు నీటిని నిల్వ చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. నీటి వనరులను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా చిలకలూరిపేటలో జనగణన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికి వెళ్లి జనాభా వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

19- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/18/2026 11:44 PM Page 4



# సేవలకు అభినందనలు




**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు సేవలను నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా మున్సిపల్ బదిలీలలో భాగంగా ఆయనను కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ చేసిన నేపథ్యంలో శనివారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మయూర్ అశోక్ శాలువాతో సత్కరించి వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు. ఆయన మాట్లాడు తూ గత సంవత్సరన్నర కాలంగా అదనపు కమిషనర్‌గా పనిచేసిన ఓబులేసు అంకితభావంతో విధులు నిర్వర్తించి సంస్థకు విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఎన్నికలు, జనాభా లెక్కలు, ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలు వంటి అదనపు బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహించారని, తనకు అందించిన సహకారం మరువలేనిదని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సి.హెచ్. శ్రీనివాస్, బి. శ్రీనివాసరావు, సాంబశివరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమాలపై పోలీసుల నిఘా

**కాకుమాను రక్షణ న్యూస్**



చట్ట విరుద్ధ కార్యకలాపాలపై కాకుమాను పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, గత పది రోజుల వ్యవధిలోనే రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా పేకాట నిర్వహిస్తున్న వారిపై కూడా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పోలీసులు తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కూడా పర్యవేక్షణ కొనసాగుతున్నదని వెల్లడించారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# అగ్ని భద్రత పై అవగాహన



బాపట్ల జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం ఐదవ రోజు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా బాపట్ల అగ్నిమాపక కేంద్రం పరిధిలోని పెట్రోల్ బంకులు, ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ గోదాములు మరియు పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక అధికారి కె. వినయ్ ప్రజలు, యాజమాన్యం, సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తత గురించి వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి కరపత్రాలు, గోడపత్రికలను పంపిణీ చేసి భద్రతా చర్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక కేంద్ర అధికారి జి. రామ సిద్ధార్థ, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాముల యాజమాన్యం, సిబ్బంది మరియు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# లేఅవుట్ల పై కఠిన చర్యలు

**గుంటూరు రక్షణ న్యూస్**



అనధికార లేఅవుట్‌లలో ప్లాట్లు కలిగిన యజమానులు లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్)ను వినియోగించుకోవాలని గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ సూచించారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన మూడు నెలల గడువు ఈ నెల 23వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ కింద ప్లాట్లను క్రమబద్ధీకరించుకోకపోతే భవన నిర్మాణ అనుమతులు మంజూరు కావని, రోడ్లు, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాలు కూడా అందుబాటులో ఉండవని హెచ్చరించారు. అదేవిధంగా భవిష్యత్తులో ప్లాట్ల కొనుగోలు, అమ్మకాల సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. గడువు ముగిసిన తర్వాత అనధికార లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్లాట్ల యజమానులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ స్థలాలను చట్టబద్ధంగా క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ కోరారు.

# ప్రజల భద్రతే మా ధ్యేయం

**బాపట్ల రక్షణ న్యూస్**



బాపట్ల జిల్లా పోలీస్ శాఖ మొబైల్ రికవరీపై ప్రత్యేక దృష్టి సారించి విశేష ఫలితాలు సాధిస్తోంది. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారు స్వయంగా రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. మార్చి నెలలో రికవరీ చేసిన మొత్తం 153 మొబైల్ ఫోన్లను పంపిణీ చేయగా, వాటి విలువ సుమారు రూ.30 లక్షల 60 వేలుగా ఉంది. గత నాలుగు నెలల కాలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సుమారు రూ.1.91 కోట్ల విలువ గల 959 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ నేటి జీవితంలో అత్యంత అవసరమైన సాధనంగా మారిందని, వ్యక్తిగత, ఆర్థిక, విద్యా, వ్యాపార అవసరాలన్నీ ఫోన్ ద్వారానే జరుగుతున్నాయని పేర్కొన్నారు. మొబైల్ పోగొట్టుకున్నప్పుడు ఆందోళన చెందకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. సాంకేతిక నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాల సహాయంతో టెలికాం సంస్థలతో సమన్వయం చేసి ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఉన్న ఫోన్లను కూడా ట్రేస్ చేసి రికవరీ చేస్తున్నామని తెలిపారు. ఈ చర్యల వల్ల మొబైల్ రికవరీ శాతం గతంలో 30 శాతం ఉండగా ప్రస్తుతం 65 శాతానికి పెరిగిందని వెల్లడించారు. అలాగే సరైన ఆధారాలు లేకుండా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనరాదని, లాక్ ఓపెన్ చేయరాదని షాపుల యజమానులకు హెచ్చరించారు. అనుమానాస్పదంగా ఫోన్లు అమ్మే వారిపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు, పోలీసులు, సిబ్బంది మరియు మొబైల్ ఫోన్లు అందుకున్న బాధితులు పాల్గొన్నారు